సిపిఐలోకి బిఆర్ఎస్ వార్డు మెంబర్ చేరిక

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 02 మార్చి , 2026 | పేజీలు : 04

అక్రమ కట్టడాల వెనుక

అంతు చిక్కని మర్మం?

నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు...

ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటి అక్రమ కట్టడాలకు అడ్డాగా మారింది. టౌన్ ప్లానింగ్ అధికారులు వీటిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అక్రమ కట్టడాలపై ప్రశ్నిస్తే తప్ప వాటి జోలికి వెళ్ళడం లేదు. అధికార పార్టీకి చెందిన ఓ బడా నాయకుడు, ప్రతిపక్ష పార్టీకి చెందిన మరో బడా నాయకుడు ఫోన్ చేసి పలానా వ్యక్తి నిర్మిస్తున్న భవనం వైపు వెళ్ళకండి అని చెప్పడంతో తాము ఏమి చేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఇదిలా ఉంటే నాయకుల పేర్లను చెప్పుతున్న అందులో వాస్తవం లేదనే మరో వాదన ఉంది. అధికారులే అక్రమ నిర్మాణదారుల నుండి భారీగా అమ్యామ్యాలు తీసుకొని వారి పేర్లు చెబుతూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సోషల్‌మీడియాలో, ఆయా పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితమైనప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తూ కేవలం నోటీసుల జారీతో సరిపెడుతున్నారు. వరుసగా మూడు నోటీసులు జారీ చేసి చివరగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్ డిఓ, ఆర్ అండ్ బి, పోలీసు, ఫైర్, మున్సిపల్ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటికి వీటిపై నిర్ణయం తీసుకోవాలి రాసి పంపుతూ చేతులు దులుపుకుంటున్నారు. గత మూడు సంవత్సరాల నుండి ఈ టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఒక్క అక్రమ నిర్మాణదారునిపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు మచ్చుకు కూడ లేకపోవడం గమనార్హం. దీంతో టాన్‌ప్లానింగ్ అధికారులు టాస్క్‌ఫోర్స్ అధికారులకు రాసి పంపిన వందలాది అక్రమ కట్టడాలపై నేటికి ఏ చర్యలు లేవు. ఇటీవల కాలంలో పట్టణ పరిధిలో బహుళ అంతస్తులతోపాటు వాణిజ్య వ్యాపారాల కోసం భారీ షెడ్లను నిర్మిస్తున్నారు. వీటిలో ఒకటి, రెండు మినహా ఏ ఒక్కదానికి కూడా అనుమతులు లేవు. మున్సిపాలిటి పరిధిలోని ఖమ్మం రహదారి వెంట మూసీ కాలువ పక్కన పెయింట్ దుకాణ యజమాని 10 గుంటల స్థలంలో ఐరన్ రేకుల ఫ్యాక్టరీ కోసం భారీ షెడ్డును నిర్మిస్తున్నారు. ఇది చివరి దశకు చేరింది. దీనికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అనేక

మంది అధికారులకు ఫిర్యాదులు చేశారు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటి వరకు రెండు నోటీసులు ఇచ్చి సరిపెట్టారు. దీంతో నాలుగు నెలల కాలం గడిచిపోవడంతో దీని నిర్మాణమే పూర్తయింది. దీనిపై మరోమారు ఆరోపణలు రావడంతో పనులు నిలిపివేసిన అధికారులు నాయకుల ఒత్తిడితో వారిపై ఏ చర్యలు తీసుకోలేకపోయామని చెబుతున్నా వీరిపై కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ కట్టడాల వల్ల ఏడాదికి ప్రభుత్వానికి రావల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండిపడుతుంది.

పేదవారికి ఒకలా ఉన్నవారి పట్ల మరోలానా...

పేదవారికి ఒకలా ఉన్నవారి పట్ల మరోలా సూర్యాపేట టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా మేము నిర్మించుకుంటే బుల్డోజర్లతో కట్టడాలు నేలమట్టం చేసే అధికారులు ఉన్న వారికి కేవలం నోటీసులతో సరిపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బహుళ అంతస్తులు ఉన్నవారు రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా మరో ఒకటి రెండు నిర్మించుకుంటుండగా, వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్వహణకు 5 గుంటల స్థలం నుండి మొదలుకొని 10 నుండి 15 గుంటల విస్తరణలో దాదాపు పట్టణంలో 50కు పైగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన భారీ షెడ్లు ఉన్నాయి. ఇట్టి నిర్మాణదారులకు అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చర్యలు తీసుకోకపోవడంలో ఉన్న అసలు మర్మం ఏమిటన్నది ఉన్నతాధికారులు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణ దారులపై చర్యలు తీసుకుంటాం
టౌన్ ప్లానింగ్ అధికారి ఉయ్యాల సోమయ్య

అక్రమ నిర్మాణ దారులపై ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారి ఉయ్యాల సోమయ్య చెప్పారు. అక్రమ నిర్మాణాలపై 'ప్రజాపక్షం' ఆయనను వివరణ కోరగా... అక్రమ నిర్మాణదారులకు పనులు నిలిపివేయాలని నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న టాస్క్‌ఫోర్స్ కమిటికి కూడా తాము రాసి పంపినట్లు చెప్పారు. ఖమ్మం జాతీయ రహదారి వెంట మూసీ కాలువ పక్కన అక్రమంగా భారీ షెడ్డు నిర్మిస్తున్న కామద వినీష తండ్రి ఫిరోజ్ కుమార్‌కు ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేశామని స్పష్టం చేశారు. తాము నిర్మాణ పనులు ఆపితే ఓ ప్రజాప్రతినిధి వచ్చి వారితో నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేయించి అందుకు అవసరమైన ఫీజును కార్యాలయంలో చెల్లిస్తామని చెప్పడం జరిగిందన్నారు. కానీ నేటికి దరఖాస్తు అంటూ తమకి పెట్టుకోలేదని, ఫీజు కూడా ఏమి చెల్లించలేదని చెప్పారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్ళి తప్పక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బుద్ధవనంలో ఘనంగా 3వ ధమ్మయాత్ర ముగింపు వేడుకలు

ప్రజాపక్షం/నందికొండ: బుద్ధుని బోధనల ప్రచారమే లక్ష్యంగా థాయిలాండ్‌భారత బౌద్ధ భిక్షువుల ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ ధమ్మయాత్ర 'సువర్ణభూమి నుండి బుద్ధభూమి వరకు" ముగింపు వేడుకలు నాగార్జున సాగర్‌లోని బుద్ధవనంలో మార్చి 2 సాయంత్రం 6 గంటలకు ఘనంగా జరగనున్నాయి. కర్ణాటకలోని గుల్బర్గ సిద్ధార్థ బుద్ధ విహార్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఆధ్యాత్మిక వాతావరణంలో ముగియనుంది.
ముగింపు సభకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరవుతారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటర్ సి. ఆంజనేయ రెడ్డి (రిటైర్డ్ ఐపీఎస్), సంఘా డైరెక్టర్ వెన్. ప్రా సోంగ్ సక్ కోవిడో, గగన్ మాలిక్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో "మై జర్నీ విత్ బు" హిందీ నాటక ప్రదర్శన ఉంటుంది.మార్చి 3 ఉదయం ప్రత్యేక చంటింగ్, మాఘపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య తెలిపారు. బౌద్ధ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతులకు భారీ ఊరట

98 వ్యవసాయ యంత్రాల పంపిణీ

ప్రజాపక్షం/మునుగోడు: రాష్ట్రంలో రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గం వ్యాప్తంగా 98 మందికి సబ్సిడీ కింద మంజూరైన వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులతో సాగు చేసి దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ సబ్సిడీ పథకాల ద్వారా రైతులపై ఖర్చు భారం తగ్గుతుందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తాయని అన్నారు.కార్యక్రమంలో రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, ఎంబి ప్లౌలు, కేజీ వీల్స్, పవర్ గ్రేడర్లు, బ్రష్ కట్టర్లు వంటి ఆధునిక వ్యవసాయ యంత్రాలు సబ్సిడీపై అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, వ్యవసాయ శాఖ ఏడి వేణుగోపాల్, వివిధ మండలాల ఏవోలు, క్లస్టర్ల ఏఈవోలు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహానగరాలకు దీటుగా హర్షగ్రానైట్స్

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మహానగరాలకు ధీటుగా హర్ష గ్రానైట్స్ ప్రారంభం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పులవేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హర్ష గ్రానైట్స్ మార్బుల్స్ టైల్స్ షోరూం గోదామును వారు ప్రారంభించి మాట్లాడారు. దాదాపు 150 రకాలతో మహానగరాలకు ధీటుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో మార్బుల్స్ టైల్స్‌షో రూమ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్క్వేర్ ఫీట్ రూ.33 నుంచి రూ.133 వరకు ఉంచడం జరిగిందన్నారు. నిర్వాహకులకు నాగోల్‌లో కేంద్రం ఉండడంతో సూర్యాపేటలో కూడా ఉండాలనే ఆలోచనతో ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందిని నివారించేందుకు ఇక్కడే షోరూమ్ గోదాం ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అతిపెద్ద విస్తీర్ణంలో అందరి అభిరుచి మేరకు హర్ష గ్రానైట్ మార్బుల్ టైల్స్ షోరూం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్‌అలీ, స్థానిక కౌన్సిలర్ నాగుల వాసు, మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ, రావుల రాంబాబు, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, సర్పంచ్ భూక్య రాజు నాయక్, నిర్వాహకులు శేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

ప్రజాపక్షం/అర్వపల్లి : మండలంలోని రామన్న గూడెం గ్రామంలో గల గౌడ కులదైవం శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయం 2వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న, వార్డు సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి చైర్మన్ కారింగుల నాగరాజు, నాయకులు కర్నాటి మురళి పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇరాన్ దేశంపై జరుగుతున్న దాడులను నివారించాలని, ప్రపంచ శాంతిని కోరుతూ విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం సభ్యులు ఆదివారం ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, పాస్టర్ ధీరావత్ హన్యా నాయక్ మాట్లాడుతూ యుద్దాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమాబాయి, సుధా రాణి, జనార్ధన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాపక్షం/చండూరుః చండూరు మున్సిపాలిటీలోని 7వ వార్డులో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ కోడి సుష్మావెంకన్న తెలిపారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం కౌన్సిలర్ వార్డులో తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ , సిసి రోడ్లులతో పాటు వార్డు సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ , లతీఫ్‌పాష, ఖలీల్ పాల్గొన్నారు.

నేడు కరాటే బెల్టులు అందజేత

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నేడు క్రీడాకారులకు అందించే బెల్టుల ప్రధానోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్, 18వ వార్డు కౌన్సిలర్ బూడిద సైదులు మాట్లాడుతూ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో క్రీడాకారులకు సినీ నటుడు సుమన్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, నాయకులు గుండు నరేందర్, ఎస్‌కె.అబ్దుల్లా, బనావత్ రామకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : వైద్య శిబిరాలను సూర్యాపేట పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం పట్టణంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్‌కె ఆర్ కన్‌స్ట్రక్షన్ సంకినేని కృష్ణారావు సహకారంతో శ్రీకంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన క్యాంప్‌లో చైర్‌పర్సన్‌తోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేటలో శ్రీకంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ వారు 10వ సారి ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ప్రతి క్యాంప్‌లో 50 మందికి కంటి ఆపరేషన్ చేసి ఉచిత మందులు అందించి వారి కుటుంబాలకు వెలుగులు పంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ సభ్యులు ఉప్పు నాగయ్య, బత్తిని దామోదర్ రెడ్డి, కట్టకోల పూర్ణచంద్రరావు, యాస రాంకుమార్ రెడ్డి, కాళిదాసు, రమాదేవి పాల్గొన్నారు.

కౌన్సిలర్ జహీర్‌ను సన్మానించిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పిఆర్‌టియు ఉపాధ్యాయ కుటుంబానికి చెందిన జహీర్ 16వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన సందర్భంగా ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షుడు బషీర్‌తో కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జహీర్ మాట్లాడుతూ 16వ వార్డు ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాలు, యూనియన్ నాయకులు కలిసి తనను గెలిపించారని అన్నారు. వారందరికి చేదోడు వాదోడుగా ఉంటూ సమన్వయంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ నిధుల కింద నిధులు మంజూరు చేసి వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో పిఆర్‌టియు సంఘ భవనం ఏర్పాటు అంశాన్ని స్థానిక పెద్దలు, ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డితోపాటు నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణ పోరాటంలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఎస్‌సి వర్గీకరణ పోరాటంలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనం నందు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు ములకలపల్లి రవి మాదిగ అధ్యక్షతన జరిగిన మాదిగ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించి ఆయన మాట్లాడారు. దేశంలో ఎస్‌సి రిజర్వేషన్ సమాన పంపిణీ కోసం ఏర్పడ్డ సామాజిక న్యాయ ఉద్యమ సృష్టికర్త మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని పోరాటంలో వీరమరణం పొందిన మాదిగ అమరవీరులను స్మరిస్తూ మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత జాన్‌విల్సన్ మాదిగ, ప్రభాకర్ మాదిగ, ఎర్ర వీరన్న మాదిగ, గంట బిక్షపతి మాదిగ, ములకలపల్లి మల్లేష్ మాదిగ, మేడి కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు దూరంగా హోలీ జరుపుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : హోలీ పండుగ సందర్భంగా ఉత్సవం జరుపుకునే వారు ప్రమాదాలకు దూరంగా ఉంటూ సంతోషకర వాతావరణంలో కలిసిమెలిసి జరుపుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులపై క్రమశిక్షణతో ఉండాలని కోరారు. రంగులు చల్లుకునే సమయంలో పరిసరాలను గమనించాలన్నారు. రంగులు ఇష్టపడని వ్యక్తులపై బలవంతంగా రంగులు చలవద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం మతు లో వాహనాలు నడపడం నేరమన్నారు. ఉత్సవం విషాదం కాకుండా చూసుకోవాలన్నారు. రసాయన రంగులు ఉపయోగిస్తే అనారోగ్యం కలిగే అవకాశం ఉన్నందున సాంప్రదాయ రంగులతో హోలి జరుపుకోవాలన్నారు. నివాసాలపై, ప్రార్థనా మందిరాలపై రంగులు చల్లకూడదని స్పష్టం చేశారు. పండుగ అనంతరం లోతైన నీటిలోకి, నీటి ప్రవాహం ఉన్న కాల్వలలోకి ఈతలకు వెళ్ళకూడదన్నారు. తొందరపాటు, అత్యుత్సాహంతో ప్రమాదాల బారిన పడకుం డా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇతరులను, మహిళలను గౌరవించాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున వీధుల్లో, బ హిరంగ ప్రదేశాల్లో గుంపులుగా ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల కదలికలకు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తు చేశారు. పోలీసు సూచనలు, నియమాల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/చండూరుః చండూరు మున్సిపాలిటీని 1వ వార్డుకు చెందిన కొలుగూరి వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిదెంచాడు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్ మృతుడు వెంకటేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి 15వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

సైన్స్ ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సమాజంలోని సమస్యలను కొనుగొని వాటి పరిష్కార మార్గాలు చూపడానికి సైన్స్ ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో జయ సృష్టి 2026పేరుతో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే బొమ్మల కొలువు, భయకంపితులను చేసిన డెవిల్ హౌస్, హైడ్రాలిక్ మిషన్స్, పిఎస్‌ఎల్‌విసి33, 37 నమూనాలు, నానోట్యూబ్ నమూనా, సోలార్ ఎనర్జీ, యుద్ధ ట్యాంక్, ఎలక్ట్రానిక్ హోమ్ అప్లయిన్స్ కంట్రోల్డ్ బైరిమోట్ ఫుడ్ కోర్టు, స్పేస్‌రూమ్‌లను చూసి ఆమె విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మ ప్రపంచశాంతి పాదయాత్రకు సంఘీభావం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ కర్ణాటక రాష్ట్రం సిద్ధార్థ్ విహార్ నుండి ప్రారంభమైన బౌద్ధ దమ్మ శాంతియాత్ర ఆదివారం నాగార్జునసాగర్‌కు చేరుకుంటున్న సందర్భంగా పెదవూర మండల కేంద్రంలో యాత్రలో పాల్గొని బౌద్ధ గురువులకు తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ స్వాగతం పలికి యాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో పుట్టి నడయాడిన బౌద్ధం ప్రపంచ వ్యాప్తంగా శాంతిని బోధిస్తూ విరాజిల్లుతుందన్నారు. ప్రపంచంలోని థాయిలాండ్ బౌద్ధ గురువులు ఈ యాత్రలో పాల్గొంటున్నారని చెప్పారు. బౌద్ధ వనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య సమన్వయంతో సాగుతున్న యాత్రలో తెలంగాణ ప్రాంత బౌద్ధ నాయకులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మగాని వినయ్ గౌడ్, సుమన్ నాయక్, ప్రవీణ్, వీరు, చందర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటిన బోడంపర్తి విద్యార్థులు

ప్రజాపక్షం/చండూరుః చండూరు మండలం బోడింగిపర్తి జడ్‌పి హెచ్‌ఎస్ ఎంజీఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 5మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలలో ప్రతిభను చాటారని మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఊట్కూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలో ఒక్కసారి సీటు సంపాధిస్తే 8 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం 12వేల రూపాలయల ఉపకార వేతనం అందజేయడం జరుగుతుందని అన్నారు. కె. నరేంద్ర, జె.లక్ష్మీ ప్రసన్న, కె.మాధురి, డి.నిఖిల్ , జి. అభి సీటు సంపాధించిన విద్యార్థులు అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు , మండల విద్యాధికారి ఊట్కూరి సుధాకర్‌రెడ్డి అన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి త్యాగం మార్గదర్శనీయం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటమే మార్గమని ఆదర్శంగా నిలిచిన వ్యక్తి శ్రీనివాస్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి 44వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పేదలకు భూమి పంచాలనే న్యాయమైన డిమాండ్‌తో జరిగిన పోరాటాల్లో భూస్వామ్య కాంగ్రెస్ గుండాల చేతిలో ప్రాణత్యాగం చేసిన శ్రీనివాస్‌రెడ్డి త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన చూపిన పోరాట మార్గంలో ముందుకు సాగాలన్నారు. డబ్బికార్ మల్లేష్, గాదె పద్మమ్మ, ప్రభాకర్‌రెడ్డి, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, మంగారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: నిరుపేదలకు సొంతింటి కల నిజం చేయాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం హుజూర్‌నగర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివకృష్ణ కోరారు. ఆదివారం శిల్పకళ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంద సంఘం హుజూర్‌నగర్ టౌన్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యల్క సోమయ్యగౌడ్, షేక్ ముస్తాఫా, రాంబాబు, నకిరేకంటి అంజయ్య, పల్లపు రామకృష్ణ, ఉప్పతల వెంకన్న, షేక్ నాగుల్, గుండు వెంకన్న, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

3న హోలీ పండుగ

ప్రజాపక్షం/నకిరేకల్: కామదహనం మార్చి 2వ తేదీన సోమవారం రోజు రాత్రి,హోలీ పండుగను 3న మంగళవారం ఉదయం 11.30 గంటలలోపు నిర్వహించుకోవాలని మండల బ్రాహ్మణ, పురోహితులు తెలిపారు. శాలిగౌరారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హోలీ రోజు గ్రహణం మూడు గంటల తర్వాత మొదలవుతుందని, కావున హోలీ వేడుకలు 11.30 గంటలలోగా ముగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పురోహితులు రామదుగు వెంకటరామ శర్మ, వావిలాలరామలింగయ్యశర్మ, వేణునాధశర్మ, కొడవగంటి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, వెంకటేశ్వర శర్మ,లక్ష్మీనర్సయ్యశర్మ, పులిరామకృష్ణశర్మ, లక్ష్మీప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

నరసింహకు అభినందన

ప్రజాపక్షం/నకిరేకల్ : ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ నుండి డాక్టరేట్ అవార్డు అందుకు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు వలిగొండ నరసింహ ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు.డాక్టరేట్ పట్టా పొందడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు, తన పరిశోధన పూర్తి చేయడానికి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశం కు, ఉద్దీపన ఫౌండేషన్ చైర్మన్ వేముల పుష్పకు కృతజ్ఞత తెలిపారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం అమరవీరులైనా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ సంఘం తరుపున అమరవీరులకు నీవాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు, ప్రధాన కార్యదర్శి బాలేంల నరేష్, అధికార ప్రతినిది పనుమటి సతీష్, మోత్కూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యసాగర్, సంఘం మాజి అధ్యక్షులు గజ్జెల్లి రవి పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : విద్యుత్ మీటర్ రీడర్ కార్మికుల సమస్యలను విద్యుత్ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ నాగేశ్వర్ నాయక్ కోరారు. సూర్యాపేట డివిజన్‌కు చెందిన విద్యుత్ మీటర్ రీడర్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విద్యుత్ సర్కిల్ ఆఫీస్ ఎదుట ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్నా గుర్తించకపోవడం సరైంది కాదన్నారు. మీటర్ రీడింగ్ మాత్రమే కాకుండా లైన్‌మెన్ల పనులు కూడా నిర్వర్తిస్తూ ప్రాణాలను పణంగా పెట్టి విద్యుత్ స్తంబాలు ఎక్కి బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. నెలలో కొద్ది రోజులు మాత్రమే పని దొరకడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మిగతా రోజులకు

ఉపాధి లేక కుటుంబాలు కష్టాల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ యాజమాన్యం వెంటనే స్పందించి పీసు రేటు విధానంను రద్దు చేసి నెలలో పూర్తి 30 రోజుల పని దినాలు కల్పించి జిఓ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిల్ల విద్యాసాగర్, మహేష్, ప్రవీణ్, మద్దెల సాయి, చిలుక శ్యామ్, అభినవ్, విష్ణు, మహ్మద్ షఫీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఫణిగిరి సీతరామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న ఆదర్శ మోడల్ కాలనీలోని ఇందిరమ్మ ఇళ్లను అందజేయనున్నామని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక ఇందిర భవన్‌లో పట్టణ ఐఎన్‌టియుసి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీతరామచంద్ర స్వామి దేవాలయం గట్టు వద్ద నిర్మిస్తున్న మోడల్



ఇందిరమ్మ కాలనీలో ఇల్లులేని పేదలకు ప్రతి ఒక్కరికి మోడల్ కాలనీలో చోటు కల్పిస్తామని పేర్కొన్నారు. మంత్రి అండదండలతో పట్టణ సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ గురవయ్యగౌడ్, చిట్యాల అమరనాథ్ రెడ్డి, పాశం రామరాజు యాదవ్, ముక్కంటి, సలిగంటి జానయ్య, మద్దం నాగేందర్, కందుల వెంకన్న, లలిత పాల్గొన్నారు.

యూరియా యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి సరిపడా ఎరువు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరెల్లి వెంకటేశ్వర్లు, మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. ఆదివారం నకిరేకల్‌లోని ఎన్.ఆర్. భవన్‌లో రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. యూరియా పంపిణీపై సరైన ప్రణాళిక లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రైతులను ఇబ్బందులకుగురిచేస్తున్నాయని వారు విమర్శించారు. పంటలు పొట్టదశలో ఉండటంతో యూరియా అత్యవసరమని తెలిపారు. యాప్‌లో దరఖాస్తు చేయగానే స్టాక్ లేదని చూపుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వందలాది మంది రైతులు పనులు వదిలి ఎరువు కోసం వేచి చూస్తున్నా నిమిషాల్లో స్టాక్ ముగిసినట్లుచూపుతున్నదని అన్నారు.యాప్‌ను రద్దు చేసి పంట అవసరాలకు అనుగుణంగా అన్ని దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటయ్య, ఆకుల భాస్కర్, గింజల లక్ష్మి, వెంకటేశ్వర్లు, కృష్ణ, పరమేష్ పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ ప్రారంభం

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని గోపాలపురం గ్రామంలో మంచి నీటి పంపిణీ కోసం ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను సుజలా దాతా, ప్రముఖ రియల్ ఎస్టేట్ అధినేత శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ గుర్రాల నాగేశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పుట్ట సాయిలు ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, వార్డ్ సభ్యులు కాశబోయిన కనకమ్మ, పుట్ట గీత, దాసరి పరమేశ్, నారం కృష్ణవేణి, కూర కనకయ్య, మలేబోయిన అశోక్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య భవన శంకుస్థాపన

ప్రజాపక్షం/అర్వపల్లి : మండలంలోని వెల్పుచర్ల గ్రామంలో నూతనంగా నిర్మాణం చేయనున్న గ్రామ పంచాయితీ మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి శంఖుస్థాపన సందర్భంగా గ్రామ సర్పంచ్ చెరుకు వెంకటమ్మ వెంకన్నల చేతుల మీదుగా ముగ్గుపోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఏఈ కుమారస్వామి, గ్రామ పంచాయితీ కార్యదర్శి కృష్ణవేణి, వార్డు సభ్యులు గైగుల్లా ప్రశాంతి శ్రీధర్, ఖమ్మంపాటి మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

ప్రజాపక్షం/నకిరేకల్: నకిరేకల్ మండలంలోని తొమ్మిదిగ్రామపంచాయతీలకు చెందిన 82 మంది వార్డు సభ్యులకు తొలి విడత శిక్షణ తరగతులు నేటి నుంచి ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకుశిక్షణకార్యక్రమం ప్రారంభమవుతుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.శిక్షణ తరగతులకు వార్డు సభ్యులు తప్పనిసరిగా హాజరై పరిపాలనా వ్యవహారాలపై సమగ్ర అవగాహన పొందాలని, గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా కృషి చేయాలని ఆయన సూచించారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా తెలిపారు.

సమ్మె బాట పట్టిన విద్యుత్ స్పాట్ బిల్లర్స్

ప్రజాపక్షం/నకిరేకల్ : చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్న విద్యుత్ స్పాట్ బిల్లర్స్ సమ్మెబాట పట్టారు. నెలరోజుల పని దినాలు కల్పించాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్‌తో రాష్ట్ర కమిటీ మార్చి ఒకటి నుంచి సమ్మెలోకి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నకిరేకల్ నియోజకవర్గంచెందిన స్పాట్ బిల్లర్స్ నేటినుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. శనివారం నకిరేకల్ ఏ.ఈ రంజిత్ కుమార్ కు వినతిపత్రం. అందజేశారు ఆదివారం సబ్ స్టేషన్ లో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పొన్నం అశోక్ మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలు దాదాపు 15 నుంచి 20ఏళ్లుగా మీటర్ రీడింగ్ తీస్తూ స్పాట్ బిల్లర్ గా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతినెల కేవలం రూ.2వేల వేతనంతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులపాటు పని దినాలు కల్పించి కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోపగోని కృష్ణ,కంచర్ల విష్ణు,గోపగోని శివకుమార్, కే శరత్ జి అంజి ఉపేందర్ పాల్గొనారు.

అడవి పంది దాడిలో వలస కూలీకి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: వలస కూలి వ్యక్తిపై అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న సంఘటన యాదాద్రి జిల్లా పోచంపల్లి మండలానికి చెందిన ధోతి గూడెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం కూలీ పని కోసం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకనపల్లి నుంచి వచ్చిన వలస కూలి పాలకుర్తి వెంకటేశ్వర్లు(35).పనిచేస్తున్న ప్రదేశంలోకి అడవి పంది అకస్మాత్తుగా వచ్చి దాడి చేయడం వలన తీవ్రమైన గాయాలు అయ్యాయి. వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం కూలీలు 108కి ఫోన్ చేయగానే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స కోసం బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు.అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్ళవలసిందిగా వైద్యులు సూచించారు. రోగి యొక్క పరిస్థితి పరిశీలించి 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషి యన్ విశ్వం వెంటనే ప్రథమ చికిత్స అందిస్తూ గాయాల పాలైన వెంకటేశ్వర్లుకు మనోధైర్యాన్ని నింపుతూ గాంధీ ఆసుపత్రికి పంపించారు గాంధీ ఆసుపత్రి తరలించినందుకు పేషెంట్ యొక్క బంధువులు ఈఎంటి విశ్వం పైలెట్ చిన్న కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఇందిరమ్మ ఇల్లు వరం

ప్రజాపక్షం/బీబీనగర్ : పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొట్టొల్ల శ్యామ్ గౌడ్, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవపురం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన సర్పంచ్‌తో కలిసి గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్వాహకులకు నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం రాఘవపురం నుండి లక్ష్మీ దేవి కూడా వారికి వెళ్లే రహదారిని సిసి రోడ్డుగా మార్చినట్లు ఆయన తెలిపారు. ఉప సర్పంచ్ కవిత, గొలనుకొండ పద్మా శ్రీశైలం, భాగ్యమ్మ ఆంజనేయులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల దినోత్సవం

ప్రజాపక్షం/బీబీనగర్ : ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ ఉద్యమ సాధనలో తమ ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోస్కొండ మహేష్ బాబు ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దేవరకొండ శ్రీనివాస్, పొట్ట వెంకటేష్, పొట్ట నవీన్ కుమార్, పొట్ట రాజు, పొట్ట భాస్కర్, సుధాకర్, పొట్ట రాజు, మీసాల శ్రీకాంత్, పొట్ట నరేష్, పొట్ట భరత్ పాల్గొన్నారు.

మంచినీటికి ఇబ్బందులు పడొద్దు

ప్రజాపక్షం/డిండి; మంచి నీటికి పెద్దతండా గ్రామ పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడొద్దని, మూడు సంవత్సరాల కొకసారి తండా ప్రజలు ఎంతో సంతోషంగా నిర్వహించుకునే హోలీ పండగ సందర్భంగా నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా పెద్దతండా సర్పంచ్ కాట్రావత్ చిట్టెమ్మ శంకర్‌నాయక్ గ్రామంలో ఉన్నటువంటి బోర్లలో ఆదివారం గ్రామ పంచాయతీ ప్రజల అవసరాలకనుగుణంగా నాలుగు సింగిల్ ఫేజ్ మోటర్లను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బిపిఎల్ సీజన్ క్రికెట్ పోటీల ప్రారంభం

ప్రజాపక్షం/బీబీనగర్ : బీబీనగర్ మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శరీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పోటీలో గెలుపొలుపు ఓటమిలు సహజమేనని యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రికెట్ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోలి నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు గోలి నరేందర్ రెడ్డి, ఎండి అక్బర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్, నిర్వాహకులు పొట్ట నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఆన్-సైట్ ఎఫ్ఐఆర్

ప్రజాపక్షం/అడ్డగూడూర్ : తెలంగాణ పోలీసు శాఖ ప్రజలకు మరింత వేగంగా మరియు పారదర్శకంగా సేవలు అందించడానికి ప్రవేశపెట్టిన కీలకమైన సంస్కరణ అయిన 'ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్'ని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం అడ్డగూడూరు పోలీస్ వారు తమకు వచ్చిన 100 కాల్‌లో బొడ్డుగూడెం గ్రామానికి చెందిన పిర్యాది కురిమిల్ల ఉమా W/o రాజ్ కుమార్ తనను తన అత్త పద్మ, మామ సోమయ్యలు శారీరకంగా వేధిస్తున్నారని అలాగే ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లోకి వచి చేయి చేసుకున్నారని చెప్పగా వెంటనే స్థానిక ఎస్సై వెంకట రెడ్డి, బ్లూ కోలట్స్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, రాజశేఖరరెడ్డిలు పిర్యాది ఇంటి వద్దకు వచ్చి జరిగిన విషయం తెలుసుకొని పిర్యాది నుండి పిర్యాదు తీసుకోని అక్కడికక్కడే (ఆన్ సైట్ ఎఫ్ఐఆర్) ఎఫ్ఐఆర్ చేసి ఫిర్యాదు రాలికి అంద చేసి ఇన్వెస్టిగేషన్ ప్రారంభించినారు. అలాగే మండలం లో మహిళలు, చిన్నపిల్లలు వంటి వారి పై ఏదైనా నేరాలు జరిగినట్లయితే వెంటనే 100కి డయల్ చేసినట్లయితే పోలీసు వారు సత్వరం స్పందించి అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ చేస్తారని తెలిపారు.

కార్పొరేటర్ వేణుగోపాల్ రెడ్డికి ఘనంగా సన్మానం

ప్రజాపక్షం/నలగొండ టౌన్ : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని 41వ డివిజన్ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించిన కేసాని వేణుగోపాల్ రెడ్డి ని ఆదివారం పట్టణంలోని విద్యానగర్ వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు శాలువాలతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం లో మున్సిపల్ కౌన్సిలర్ గా వేణుగోపాల్ రెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడం తో పాటు, నిత్యం ప్రజల మధ్య ఉంటూ అందరికీ అందుబాటులో ఉంటారని అపార్ట్మెంట్ వాసులు వారి సేవలను కొనియాడారు . ఎవరికి ఏ ఆపద వచ్చిన వెంటనే స్పందించేతత్వం వేణుగోపాల్ రెడ్డి సొంతం అని అందుకే నూతనంగా ఏర్పడిన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోనూ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు మేరెడ్డి జనార్దన్ రెడ్డి, తుమ్మల లింగస్వామి, యరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, లోట్లపల్లి కోటయ్య,దాయం భూపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, వాసుదేవుల ప్రఖ్యాత్, రమేష్, చంద్రశేఖర్ రావు, అప్పారావు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళులు

ప్రజాపక్షం/భువనగిరి : మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బూసి మహేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ హాజరై అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 సంవత్సరాల నుండి ఏబిసిడి వర్గీకరణ సాధనకై పోరాడి వారి ఆత్మ బలిదానాల త్యాగ ఫలమే ఈనాటి వర్గీకరణ అని, నేటి వర్గీకరణ అమరులకు అంకితం అని అమరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ రమేష్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపాక నాగరాజు మాదిగ పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/నాంపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సీత రామాంజనేయ స్వామి దేవాలయం లో గీత భక్త బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్రమైన భగవద్గీత పారాయణం ఘనంగా జరిగింది. గీతా శ్లోకాల మధుర నాదంతో దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ సందర్భంగా భజన కార్యక్రమం కూడా నిర్వహించగా, భక్తులు హృదయపూర్వకంగా పాల్గొన్నారు. గీత యొక్క ప్రాముఖ్యత, మన జీవన విధానంలో గీత బోధించే ధర్మం, కర్తవ్యనిష్ఠ, సమత్వ భావం వంటి అంశాలపై భక్తులకు వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నాటి పెద్ద పాపయ్య, ఏరెడ్ల నరసింహ రెడ్డి, అంబల్ల చెన్నయ్య, యాదయ్య గౌడ్, సంగేపు పరంధాములు, కామన బోయిన పరంధాములు, అచ్చయ్య, నేర్లకంటి కేశవులు,ఎల్ల వెంకటేశం పాల్గొన్నారు.

ఘనంగా జయరాం జాతర

ప్రజాపక్షం/చివ్వెంల : మండలంలోని జయరాం గుడి తండలో ఆదివారం జయరాం జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గత 100 సంవత్సరాలుగా జరుగుతున్న జాతర అని నిర్వాహకులు తెలిపారు. జాతరకు ఖమ్మం, వరంగల్, నల్లగొండ, హైదరాబాద్ తదితర జిల్లాల నుండి గిరిజన భక్తులు వచ్చి తమ కోరికలు తీరాలని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, సర్పంచ్ బానోతు వెంకన్నలు మాట్లాడుతూ హోలీ పండుగకు ముందు వచ్చే జాతర కావడంతో గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మ మంగ్త, నాయకులు దేవుల నాయక్, గుగులోతు సైదా నాయక్, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారులో గల అఖండ జ్యోతి స్వరూప శ్రీసూర్య నారాయణ స్వామి క్షేత్రం భక్తులు స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం, అలంకరణ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మహాసౌర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకులు కాకులారపు రజిత జనార్ధన్, గణపురం నరేష్, గణపురం రాజేష్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చందనపల్లి గ్రామ సర్పంచ్ పెద్ది లక్ష్మీ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామంలో 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఉప సర్పంచ్ ఉప్పుల మురళి, వార్డు సభ్యులు గద్దల నాగయ్య, గ్రామ ప్రజలు తదితరులున్నారు.

కరాటే బెల్ట్ అప్ గ్రేడింగ్ ఎగ్జామ్ పోటీలలో ప్రతిభ

ప్రజాపక్షం/నకిరేకల్ : జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా నకిరేకల్ డోజో, నర్రా రాఘవరెడ్డి విజ్ఞాన కేంద్రం డోజో ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ పరీక్షలో 41 మంది విద్యార్థులు పాల్గొన్నారు.బ్రౌన్ బెల్ట్ 2 విభాగంలో పి.నిశాంత్, పి.హర్ష వర్ధన్, పి భరత్ రామ్, పరపుల్ బెల్ట్ విభాగంలో శ్రీహర్ష .బ్లూ బెల్ట్ విభాగంలో శ్రీలక్ష్మి, పి. సహస్ర, రుద్రాప్రణవ్ వెంకట్, ఎం. రాజ్విక, గ్రీన్ బెల్ట్ విభాగంలో సహస్ర, గౌతమ్ నంద, అభివర్ధన్,ఈశ్వర్,సాత్విక, సాయి వర్ధన్, సాయి సాత్విక్ ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు బి. ప్రకాష్ రావు, వెంకటేశ్వర్లు, జే కే ఏ ఐ జిల్లా ఉపాధ్యక్షులు అంతటి సోములు గౌడ్,కరాటే మాస్టర్లు ఆర్. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో గుర్తింపు

ప్రజాపక్షం/బీబీనగర్ : ఉపాధ్యాయుల కృషితోనే యూపీఎస్ మక్తాసంతారం పాఠశాలకు రాష్ట్ర జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం గర్వకారణం అని జిల్లా సీఎంవో ఫీసర్ లింగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మత్త అనంతారం గ్రామంలో యుపిఎస్ పాఠశాల నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సర్పంచ్ ధర్నా బోయిన కిలేందర్‌తో కలిసి విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, సుధ ధర్మా రెడ్డి, నాగయ్య, గీతా, హేమలత, సంధ్యారాణి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని టి పి గౌరారం ఏకశీల చలిదోన లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు వేధమంత్రోచ్చారణల మద్య శాస్త్రక్తంగా ఉత్సవాలను నిర్వహించారు.స్వామి వారికి,అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు,మంగళ వాయిద్యాల నడుమ ధ్వజారోహణ కార్యాక్రమాన్ని ఆలయ ప్రాంగణమంతా భక్తుల నామస్మరణతో, మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వట్టికోటి రవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణ అధికారి జల్లెపల్లి జయరామయ్య, సర్పంచులు ముమ్మడి ప్రసన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టియుసి జెండా

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ జెండా అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా ప్రెసిడెంట్ అంబటి సోమన్న అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో రాజీవ్‌గాంధీ బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఠాగూర్ నాగేంద్రసింగ్, ఎండి.హఫీజ్, ఉపాధ్యక్షులుగా ఉప్పాల కిరణ్‌కుమార్, ఎస్‌కె.నాగుల్‌మీరా, సహాయ కార్యదర్శిగా ఓర్సు వెంకటేష్, కోశాధికారిగా వాసా శివకృష్ణ, ప్రచార కార్యదర్శిగా చిట్టిమల్ల సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేందర్, నాగెల్లి శ్రీనులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పరిక వెంకటేశ్వర్లు, మేకల రాజిరెడ్డి, సైదాచారి పాల్గొన్నారు.